
ప్రజాశక్తి
మంగళవారం 28 అక్టోబర్ 2025
5
విజయనగరం



కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన మంత్రి



కంట్రోల్‌రూమ్‌లో కలెక్టర్‌తో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరంకోట : కలెక్టరేట్‌లో మొంథా తుపాను కంట్రోల్ రూమ్‌ను సోమవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సందర్శించారు. తుపాను సన్నద్ధతను మంత్రికి కలెక్టర్ రామసుందర్ రెడ్డి వివరించారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి నష్టమూ జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి శ్రీనివాస్ ఆదేశించారు.

చింతపల్లిలో కోతకు గురైన తీరం



భయం గుప్పెట్లో అన్నదాత

- వెన్ను పొడిచే దశలో ముంచుకొచ్చిన తుపాను
- 'మొంథా' ముదిరితే భారీ నష్టమే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి


తెర్లాం మండలంలో నేలకొరిగిన వరిచేనును పైకి ఎత్తుతున్న రైతులు


గుర్ల మండలం ఇంటిపేటలో నీటమునిగిన వరిచేనును బయటకు తీస్తున్న మహిళా రైతులు

తుపాను రాకతో అన్నదాత కంట తీవ్ర కలవరం నెలకొంది. ఇప్పటికే అధిక వర్షాల కారణంగా మొక్కజొన్న, పత్తి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. మునుపెన్నడూ లేనంతగా ఈసారి వరి ఆశాజనకంగా ఉన్నప్పటికీ, మొంథా తుపాను తీవ్రంగా విరుచుకుపడితే వరి రైతులు కూడా భారీ నష్టాన్ని చవిచూసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచీ వర్షాలు పడుతుండటంతో రైతులు ఒకింత ఆశాభావంతో ఉండేవారు. జూన్‌లో నారు పోత, జులై నుంచి నాట్లు మొదలయ్యాయి. విజయనగరం జిల్లాలో ఈ ఏడాది వరి సాధారణ విస్తీర్ణం 2,28,035 కాగా, 2,56,700 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో వరి సాధారణ విస్తీర్ణం 1,76,356 ఎకరాలు కాగా, 1,79,500 ఎకరాల మేర నాట్లు పడ్డాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచీ పుష్కలంగా వర్షాలు కురవడం వల్ల లక్ష్యానికి మించి నాట్లు పడ్డాయి. దీనికి ముందే మొక్కజొన్న విజయనగరం జిల్లాలో 24,947 ఎకరాల్లో, మన్యం జిల్లాలో 15,029 ఎకరాల్లో, పత్తి విజయనగరం జిల్లాలో 5,818 ఎకరాల్లో, మన్యం జిల్లాలో 16,706 ఎకరాల్లో సాగయ్యాయి. ఈ రెండు పంటలూ కోతదశలో ఉన్నాయి. అధిక వర్షాలు మొక్కజొన్న, పత్తి పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. ముఖ్యంగా పొలాల్లో నీరు నిల్వ ఉండిపోవడం, కలుపు తీయడానికి సైతం అవకాశం ఇవ్వకపోవడం, ఎండబెట్టుకోవడానికి కూడా వెసులుబాటు లేకపోవడం వంటి కారణాలతో దాదాపు 60 శాతం దిగుబడి తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొలి నుంచీ వర్షాలు సహకరించడంతో వరి ఒకింత ఏపుగా పెరిగింది. ప్రస్తుతం వెన్నుపొడిచే దశలో 90 శాతం వరిచేను ఉంది. మిగిలింది కూడా పొట్టదశలో ఉంది. నీటికి కూడా ఢోకా లేకపోవడం వల్ల ఈసారి గతం కన్నా మెరుగైన దిగుబడి వస్తుందన్న ఆశాభావంతో రైతులు ఉన్నారు. కానీ, ప్రస్తుతం మొంథా తుపాను కలవరపాటుకు గురిచేస్తోంది. విజయనగరం జిల్లాలో సీజన్ ప్రారంభం (జూన్ నెల) నుంచి ఇప్పటి వరకు 83 రోజులపాటు వర్షం కురిసింది. దాదాపు 15 మి.మీ అధిక వర్షపాతం నమోదైంది. మన్యం జిల్లాలో ఇంకా ఎక్కువ రోజులు వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే చెరువులు, జలాశయాలు నిండివున్నాయి. పంట పొలంలో కూడా నీరు చేరి ఉంది. నీరు ఇలాగే ఉంటే కోతకు కూడా ఇబ్బంది కలుగుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో మరింతగా వర్షం పడితే చెరువులు, పొలాల గట్లకు గండిపడే ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మరోవైపు గాలులు కూడా భీకరంగా వీస్తుండడంతో చేను నేలకొరిగితే పంట నేలపాలు అయినట్టేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న అలా నష్టం జరిగితే.... వరి పంటకు చివరి దశలో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొంటున్నాయంటూ రైతులు భయం... భయంతో ఉన్నారు.

కోతకు గురైన చింతపల్లి తీరం

పూసపాటిరేగ : మొంథా తుపాను ప్రభావంతో తీర ప్రాంతాల్లో ఈదురుగాలులతో వర్షాలు ప్రారంభమయ్యాయి. సముద్రం అల్లకల్లోలంగా మారి ఎగసిపడుతోంది. దాంతో చింతపల్లి తీరం వద్ద సముద్రం ఒడ్డు భారీగా కోతకు గురైంది. ఈ పరిణామంపై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మెరైన్ పోలీసులు గస్తీ కాస్తున్నారు. మత్స్యకారులు సముద్రం వద్దకు వెళ్లకూడదని, అధికారులు అనుమతి ఇచ్చే వరకు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు.

పలు పునరావాస కేంద్రాల తనిఖీ

మండలంలోని సముద్రతీర ప్రాంతంలో సోమవారం మొంథా తుపాను జిల్లా ప్రత్యేకాధికారి రవి సుభాష్ పర్యటించారు. ముందుగా కోనాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్స్యకారుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. మత్స్యకారులతో మాట్లాడి వారికి కల్పించిన సదుపాయాలు, సమస్యలను తెలుసుకున్నారు. కోనాడలో ఎమ్మెల్యే నాగమాధవి ప్రత్యేకాధికారిని కలిసి చర్చించారు. తీరంలోని సమస్యలను ఆమె వివరించారు. అనంతరం చింతపల్లి మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి ఏర్పాట్లను తనిఖీ చేశారు. రేషన్ సరుకులకు ఇబ్బంది రాకుండా చూడాలని, ఎప్పటికప్పుడు అందజేయాలని ఆదేశించారు. పర్యటనలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, ఆర్‌డిఒ డి.కీర్తి పాల్గొన్నారు.


పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి రవి

ధీమా వద్దు.. సన్నద్ధంగా ఉండాలి

తుపాను ఏర్పాట్లపై సమీక్షించిన జిల్లా ప్రత్యేకాధికారి రవి సుభాష్

కంటోన్మెంట్ : తుపాను హెచ్చరికల దృష్ట్యా రానున్న మూడు రోజులు అధికారులంతా సన్నద్ధంగా ఉండాలని జిల్లా ప్రత్యేకాధికారి రవిసుభాష్ పట్టంశెట్టి అధికారులను ఆదేశించారు. ఏమీ జరగదనే ధీమా ఉండరాదని, ఏదైనా జరగవచ్చనే ఆలోచనే ఉండాలని స్పష్టం చేశారు. కలెక్టర్ రామసుందర్‌రెడ్డితో కలిసి సోమవారం అధికారులతో తుపాను ఏర్పాట్లపై టెలికాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేకాధికారి సమీక్షించారు. దుర్బల ప్రాంతాలను, ప్రజలను ముందుగా గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. వారానికి సరిపడా నిత్యావసర వస్తువులను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పునర్నిర్మాణ పనులకు అవసరమగు సామగ్రిని సిద్ధంగా ఉంచాలన్నారు. అంతకుముందు కలెక్టర్ రామసుందర్ రెడ్డి శాఖల వారీగా సన్నద్ధతపై సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలోనే సిద్ధంగా ఉండాలన్నారు. ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ మండలాల్లో సిద్ధం చేసిన సామగ్రి వివరాలను ఎస్‌హెచ్‌ఒలకు అందజేయాలని కోరారు.


మత్స్యకారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

తీర ప్రాంతంలో కలెక్టర్, ఎస్‌పి పర్యటన

భోగాపురం : జిల్లాలో తుపాను పరిస్థితుల దృష్ట్యా భోగాపురం మండలంలోని సముద్ర తీర ప్రాంతమైన ముక్కాం గ్రామంలో కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ సోమవారం పర్యటించారు. మత్స్యకారులతో మాట్లాడి, ప్రస్తుతం తుపాను నేపథ్యంలో సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకూడదని సూచించారు. అవసరమైతే సమీప పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కలెక్టర్ సూచించారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు

విజయనగరంకోట : మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో సోమవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. అత్యధికంగా కొత్తవలసలో 46.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లోనూ భారీవర్షాలు కురిశాయి. మండలాల వారీగా వర్షపాతం వివరాలు...

మండలం	వర్షపాతం (మి.మీ.లో)
వంగర	10.6
రేగిడి	12.8
సంతకవిటి	10.4
రాజాం	13.2
బొబ్బిలి	13.8
రామభద్రపురం	9.4
బాడంగి	13.2
తెర్లాం	11.6
మెరకముడిదాం	14.8
దత్తిరాజేరు	10.4
మెంటాడ	8.0
గజపతినగరం	13.0
గరివిడి	14.6
చీపురుపల్లి	12.8
గుర్ల	13.2
బొండపల్లి	13.0
గంట్యాడ	15.2
ఎస్.కోట	15.0
వేపాడ	18.0
ఎల్.కోట	21.0
కొత్తవలస	46.8
జామి	24.0
విజయనగరం	24.2
నెల్లిమర్ల	17.2
పూసపాటిరేగ	33.4
డెంకాడ	33.8
భోగాపురం	26.2

ఆండ్ర నీరు విడుదల

మెంటాడ : తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల ఆండ్ర రిజర్వాయరులో ఇన్‌ఫ్లో పెరుగుతోంది. రిజర్వాయరు పూర్తిస్థాయి నీటిమట్టం 146 అడుగులు కాగా, ప్రస్తుతం 144.8 అడుగులకు చేరింది. దీంతో సోమవారం ప్రాజెక్టు రెండో గేటు ఎత్తి, 200 క్యూసెక్కుల నీటిని చంపావతి నదిలోకి విడుదల చేస్తున్నారు.

గ్రామస్థాయిలో అప్రమత్తత

కలెక్టర్ రామసుందర్ రెడ్డి

కంటోన్మెంట్ : మొంథా తుపానును ఎదుర్కొనడానికి జిల్లా యంత్రాంగం సర్వ సన్నద్ధంగా ఉందని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి చెప్పారు. జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అప్రమత్తంగా ఉన్నామన్నారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తుపాను సన్నద్ధతను వివరించారు. మూడు రోజులపాటు భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపారు. తుపాను ప్రభావం పడే అవకాశం ఉన్న 69 గ్రామాలను ముందే గుర్తించామని, అక్కడి యంత్రాంగాన్ని మరింత అప్రమత్తం చేశామని తెలిపారు. 8 గ్రామ సచివాలయాల పరిధిలో ముందస్తు చర్యలను చేపట్టామని చెప్పారు. పాఠశాలలు, తుపాను భవనాలు తదితర 71 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామన్నారు.

పలు రైళ్లు రద్దు

విజయనగరంకోట : మొంథా తుపాను నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేశారు. 28న విశాఖ-కిరండోల్ (18515, 16), (58501, 02), విశాఖ-సికింద్రాబాద్ (12727), విశాఖ-మహబూబ్‌నగర్ (12861,62) రైళ్లు రద్దు చేసినట్లు విజయనగరం రైల్వే స్టేషన్ మాస్టర్ ఎస్‌విబి రావు తెలిపారు. ఇతర వివరాలకు హెల్ప్ డెస్కు నెంబర్లు 08922-83331, 83332, 83333, 83334, బిఎస్‌ఎన్‌ఎల్ 08922-221202, ఎయిర్‌టెల్ 8712641260 ఏర్పాటు చేసినట్లు ఏర్పాటుచేశారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్, ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ టి.వి.గిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐ, డిప్లొమోలో ఎలక్ట్రీషియన్ పూర్తి చేసి రెండేళ్ల అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ నెల 30న విజయనగరంలోని ప్రభుత్వ ఐటిఐలో జాబ్‌మేళా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పాస్‌పోర్ట్, విద్యార్హత ధ్రువపత్రాలు, అనుభవ పత్రాలతో కలిసి https://naipunyam.ap.gov.in// వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 94929 27844, 99663 36206, 83095 61123, 99888 53335 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వైసిపి నిరసన వాయిదా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం చేపట్టాల్సిన నిరసన ర్యాలీని మొంథా తుపాను కారణంగా వాయిదా వేసినట్లు వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు తెలిపారు. సోమవారం నగరంలోని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాను కారణంగా నియోజకవర్గ ప్రజలకు సహకారం అందించడానికి వైసిపి సిద్ధంగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో వైసిపి నగర ఉపాధ్యక్షులు రెడ్డి గురుమూర్తి, అవనాపు లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శులు అల్లు చాణిక్య, బాడసింగి ఈశ్వరరావు, జమాన శ్రీనివాసరావు, కార్యదర్శులు దువ్వ శ్రీనివాసరావు, బాలి అశోక్, పైలా భవాని, రాఘవేంద్ర పాల్గొన్నారు.

1, 2న సిఎస్ఇ జిల్లా స్థాయి పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నవంబర్ 1, 2వ తేదీల్లో రాజీవ్ స్టేడియంలో సివిల్ సర్వీస్ ఎంప్లాయిస్ జిల్లా స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ప్రకటించిన తేదీలను తుపాను కారణంగా వాయిదా వేసినట్లు చెప్పారు. వివరాలకు రూపకుమార్ -9491767327, భార్గవి 8341052254ను సంప్రదించాలని కోరారు.

సిఐటియు జాతీయ మహాసభను

విజయవంతం చేయండి

యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపు



సిఐటియు జాతీయ మహాసభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ, నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేది వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. ఎన్‌పిఆర్ శ్రామిక భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వాలు ప్రభుత్వ రంగాన్ని బలహీన పరచడం, అమ్మటంతోపాటు 29 కార్మిక చట్టాలను రద్దు చేయడం వంటి కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. 8 గంటల పని దినం, సంఘాల ఏర్పాటు, సమ్మె, బేరసారాలు ఆడే హక్కులను, కనీస వేతనాలు అమలు, పని హక్కును నిరాకరిస్తూ 4 లేబర్ కోడ్లను అమలు చేస్తున్న నేపథ్యంలో ఈ మహాసభ జరుగుతుందని చెప్పారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అనే నినాదంతో గత ఐదేళ్లుగా కార్మికవర్గం పెద్దఎత్తున స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాడుతోందన్నారు.

రాష్ట్రంలో మొదటిసారిగా విశాఖ నగరంలో జాతీయ మహాసభ జరుగుతుందని తెలిపారు. మహాసభలో కార్మిక వర్గం, రైతాంగం, పేద ప్రజానీకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఆర్థిక, సాంఘిక, సామాజిక, సాంస్కృతిక దాడులపై చర్చించి భవిష్యత్తు పోరాటాలను రూపొందిస్తారని చెప్పారు. మహాసభ ముగింపు సందర్భంగా జనవరి 4న విశాఖ ఆర్‌కె బీచ్‌లో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. కార్మిక వర్గంతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, మేధావులు, కవులు, కళాకారులు, రచయితలు, ప్రజలంతా మహాసభ విజయవంతానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సురేష్, టి.వి.రమణ, ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, కోశాధికారి ఎ.జగన్మోహనరావు, నాయకులు వి.లక్ష్మి, బి సుధారాణి, ఎస్.అనసూయ, పి.శంకర్రావు, బి.సూర్యనారాయణ, రాములు, గౌరినాయుడు, రమణ, త్రినాథ్, సురేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

శశిభూషణరావుకు అవార్డు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్



సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావుకు రాష్ట్రీయ గౌరవ్ పురస్కార్ - 2025 అవార్డు లభించింది. విద్య, సామాజిక సేవా రంగంలో ఆయన చేసిన అసాధారణ కృషికి గుర్తింపుగా ఈ జాతీయ అవార్డు వరించింది.

జూడోలో మూర్తికి రజతం

ప్రజాశక్తి-కంటోన్మెంట్



మూర్తిని అభినందిస్తున్న ఎస్‌పి

ఇటీవల శ్రీనగర్‌లో జరిగిన ఆలిండియా పోలీసు జూడో క్లస్టర్ పోటీల్లో ట్రాఫిక్ కానిస్టేబుల్ బిఎస్‌ఎన్ మూర్తి రజత పతకం సాధించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మూర్తిని ఎస్‌పి దామోదర్ అభినందించారు. ఆయన క్రీడా ప్రతిభను ప్రశంసించి, త్వరలో జిఎస్ఇ అందిస్తామని ఎస్‌పి తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే తనకు నివేదించాలని ట్రాఫిక్ సిఐ సూరినాయుడును ఆదేశించారు.

మహిళల ఆరోగ్యానికి కవచం.. సఖీ సురక్ష

విజయనగరం టౌన్ : మహిళల ఆరోగ్యానికి, ఆనందానికి సఖీ సురక్ష కవచం వంటిదని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. స్థానిక రాజీవ్ స్టేడియంలో మెప్మా ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న సఖి సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మహిళలకు అందుతున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు అధిక సంఖ్యలో రావడంతో ప్రాంగణమంతా మహిళలతో నిండిపోయింది. నగరంలో రాజీవ్ స్టేడియం, కంటోన్మెంట్ యూత్ హాస్టల్, కొత్తపేట రాధాకృష్ణ కళ్యాణమండపంలో సఖీ సురక్ష కార్యక్రమాలు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

సృజనాత్మకతతో ముందుకు సాగాలి

విజయనగరం టౌన్ : సృజనాత్మకత, నూతన ఆవిష్కరణలు, ఆత్మవిశ్వాసంతో గిరిజన విద్యార్థులు ముందుకు సాగాలని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ టి.శ్రీనివాసన్ ఆకాంక్షించారు. విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీలో ఈ నెల 25, 26వ తేదీల్లో నిర్వహించిన కోడ్ ఐయామ్ స్పార్క్ నేషన్ హ్యాకథాన్ 2025లో ప్రతిభ కనబరిచిన బిఎస్‌సి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యార్థులను సోమవారం వైస్‌ఛాన్సలర్, రిజిస్ట్రార్ జితేంద్ర మోహన్ మిశ్రా అభినందించారు.

హెచ్‌ఎం గది కిటికీలకు నిప్పు

విజయనగరం టౌన్ : నగరంలోని బిపిఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గది కిటికీలకు దుండగులు నిప్పు పెట్టారు. బయట నుంచి గదిలో ఉన్న బీరువాలు, రికార్డులు చిందర వందర చేశారు. హెచ్‌ఎం శంకరరావు సోమవారం మధ్యాహ్నం వచ్చి చూడగా కిటికీకి నిప్పు పెట్టి బీరువా, పుస్తకాలను చిందర వందర చేసినట్లు గుర్తించారు. వెంటనే ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం శంకరరావు తెలిపారు.

122 కొత్త పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో కొత్తగా 122 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు చేసినట్లు డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి తెలిపారు. సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1200 పైచిలుకు ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలకు అదనంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలు స్థానాలు మార్పుకు 23, పోలింగ్ కేంద్రాల పేరు మార్పుకు 51, ప్రతిపాదిత కొత్త పోలింగ్ కేంద్రాలు 122 గుర్తించినట్లు వివరించారు. అన్ని రాజకీయ పార్టీలు వారి గుర్తింపు పొందిన బూత్ లెవెల్ ఏజెంట్ల వివరాలు ఆయా నియోజకవర్గంలో ఉన్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు అందజేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రత్యేక ఉప కలెక్టర్ ప్రమీల గాంధీ, ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కర్, సహాయ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నగరంలో కాలువల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



పెద్దచెరువు అవుట్‌ఫ్లో కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

నగరంలో నీటి ప్రవాహం అధికంగా ఉన్న ప్రధాన కాలువలను కమిషనర్ పల్లి నల్లనయ్య సోమవారం పరిశీలించారు. లోవర్ ట్యాంక్ బండ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న పెద్ద చెరువు అవుట్ ఫ్లో కాలువను గమనించారు. ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద నున్న ప్రధాన కాలువను పరిశీలించారు. నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. మొంథా తుపాను నేపథ్యంలో భారీ వరద నీరు వచ్చి చేరితే తీసుకోవలసిన జాగ్రత్తల గూర్చి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. రహదారిపై నీరు ప్రవహించకుండా ప్రత్యేకంగా చేపట్టాల్సిన ఏర్పాట్లను సమీక్షించారు. పెద్ద చెరువు అవుట్ ఫ్లో నీరు రహదారిపైకి వచ్చినా, అతి త్వరగా సమస్య పరిష్కారం అయ్యే విధంగా చొరవ చూపాలని సిబ్బందిని ఆదేశించారు.

ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాల ఏర్పాటు

మొంథా తుపానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నగర వ్యాప్తంగా ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ నల్లనయ్య తెలిపారు. ఒక్కో వార్డుకు 20 మంది చొప్పున టీం సభ్యులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మూడు రోజులకు సరిపడా నిత్యావసరాలను సిద్ధంగా ఉంచుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ప్రజలను కోరారు.

జెఎన్‌టియుజివి ప్రొఫెసర్ రాజ్యలక్ష్మికి పితృవియోగం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


తండ్రి సాంబశివరావు పాడె మోస్తున్న ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి

జెఎన్‌టియు -జివి పూర్వ వైస్ ఛాన్సలర్, ప్రస్తుతం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న దావులూరి రాజ్యలక్ష్మికి పితృవియోగం కలిగింది. ఆమె తండ్రి గుంటూరుకు చెందిన దావులూరు సాంబశివరావు (85) ఆదివారం కన్నుమూశారు. ఆయన అభ్యుదయ వాది, సిపిఎం అభిమాని. ఆయనకు భార్య శివనాగమ్మ, కుమారుడు వరప్రసాద్, కుమార్తె రాజ్యలక్ష్మి ఉన్నారు. రాజ్యలక్ష్మి జెఎన్‌టియుజివిలో ప్రస్తుతం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం జరిగిన సాంబశివరావు అంత్యక్రియల్లో ఆమె తండ్రి పాడె మోసారు. సాంబశివరావుకు దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య అంటే వీరాభిమానం. ఆయనకు గుర్తుగా ఇంట్లో సుందరయ్య కాంస్య విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు.

మొంథా ముంపుపై అప్రమత్తం

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపానుతో అధికారులు, రైతులు, ప్రజలు అప్రమత్తమయ్యారు. మొంథా ముంపుపై గ్రామాల్లో సైతం అధికారులు సోమవారం పర్యటించి పలు సూచనలు చేశారు. గుర్లమండలంలోని కురిసన వర్షాలకు వరి పంట నీట మునిగింది. ముందస్తు చర్యల్లో భాగంగా కొత్తవలస, బొబ్బిలి ప్రాంతాల్లో కల్వర్టులో పేరుకపోయిన చెత్తను తొలగించి నీరు బయటకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టారు.

ప్రజాశక్తి- సంతకవిటి

మొంథా తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంతకవిటి తహశీల్దార్ బి. సుదర్శన్ రావు కోరారు. ఈ మేరకు సోమవారం సంతకవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాగావళి వరద ప్రవాహం ఎక్కువ అయ్యే ప్రమాదం ఉందన్నారు. జావాం, కె.ఆర్‌పురం, రంగరాయపురం, తమరాం, పోడలి, చిత్తారిపురం తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులకు, గెడ్డలకు ఒంటరిగా వెళ్లొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.సురేష్ కుమార్, ప్రధానోపాధ్యాయిని ఎం. సాయిశ్వరి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలకు వరి పంట నీటిమయం

గుర్ల: మొంథా తుపాను ప్రారంభంలోనే వరి రైతులు అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయారు. సోమవారం ఉదయం వీచిన గాలులతో వరి పంట వర్షార్పణమయింది. మండలంలోని దేవుని కనపాక గ్రామ పంచాయతీ మధుర గ్రామమైన ఇంటిపేట గ్రామంలో ఇంటి గోవింద్ అనే రైతుకి సంబంధించిన రెండెకరాల పంట పూర్తిగా నీట మునిగింది. తాను ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట సోమవారం తెల్లవారుజామున వీచిన గాలులతో పూర్తిగా నీటిలో మునిగిపోయిందనీ ఆవేదన వ్యక్తం చేశాడు. మరొక వారం రోజుల్లో పంట కోతకు సిద్ధమవుతున్న తరుణంలో ఇలా అకాల వర్షాలు వచ్చి తమ బ్రతుకులలో నీళ్ళు పోసాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. నేల కొరిగిన వరి పంటను ఎఒ తిరుపతిరావు పరిశీలించి రైతుకు పలు సూచనలు చేశారు. మండలంలోని చంపావతి నదీ ప్రభావిత గ్రామాల్లో తహశీల్దార్ ఆదిలక్ష్మి, ఎస్ఐ నారాయణరావు ప్రజలను అప్రమత్తం చేశారు.

నెల్లిమర్ల: నగర పంచాయతీ వాసులు అప్రమత్తం గా ఉండాలని కమిషనర్ టి. జయరాం కోరారు. సోమవారం ఆయన పలు వార్డుల్లో పర్యటించి మొంథా తుపాను పై ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. చంపావతి నదీ ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ప్రజలు నది పరిసర ప్రాంతంలోకి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, శిథిలావస్థ భవనంలో ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

మొక్కజొన్న, వరి రైతులు అప్రమత్తం గా ఉండాలి

మొక్క జొన్న, వరి సాగు చేసే రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఒ పి. శ్రీలక్ష్మి సూచించారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మొక్క జొన్న


కొత్తవలస: కల్వర్టు కింద అడ్డంకులను జెసిబితో తొలగిస్తున్న అధికారులు

దెబ్బ తినకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించి రక్షించుకోవాలని సూచించారు.

వేపాడ: మండలంలోని భరతవానిపాలెంలో సోమవారం పశు వైద్య శిబిరం నిర్వహించి తుపాను నేపథ్యంలో పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఏరియా పశువైద్య పద సంచాలకులు డాక్టర్ చలపతిరావు రైతులకు వివరించారు. గ్రామాలలో ఉన్న పశువైద్య సేవా కేంద్రాల్లో పశుసంవర్ధక సహాయకులు అందుబాటులో ఉంటారని పశువులకు ఏ విధమైన సహాయం కావాలన్నా తెలియజేస్తే తగు సహాయం అందిస్తారని తెలిపారు. శిబిరంలో 30 పశువులకు గర్భ కోసం వ్యాధులు, పది పశువులకు సాధారణ వ్యాధులు సంబంధించిన సేవలు అందించారు. అనంతరం తుపాను రక్షణ చర్యల్లో భాగంగా 180 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి గాయత్రీ దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దనే సురక్షితంగా ఉండాలి

తుపాను నేపథ్యంలో ప్రజలు ఇంటి వద్ద సురక్షితంగా ఉండాలని ఎంపిడిఒ సిహెచ్ సూర్యానారాయణ సూచించారు. రైతులు ముఖ్యంగా వ్యవసాయాధికారుల సూచనలు మేరకు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ జె. రాములమ్మ గ్రామాల్లో దండోరా వేయించారు.

తుపాను సంసిద్ధత పై కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

గంట్యాడ, జామి, ఎల్‌కోట, ఎస్‌కోట: జిల్లాలో తుపాను సంసిద్ధత పై చర్యలను స్వయంగా పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి సోమవారం గంట్యాడ, ఎస్‌కోట, ఎల్ కోట, జామి మండలాలలో సుడిగాలి పర్యటన జరిపి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా గంట్యాడ మండలంలోని తహశీల్దార్ కార్యాలయం కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, విధుల కేటాయింపులో లోపాలను గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది విధులను సక్రమంగా కేటాయించాలని, వచ్చిన ఫిర్యాదులు నమోదు చేయడానికి ఒకరు, చేపట్టిన చర్యలు తెలియజేయడానికి ఒకరు చొప్పున


పూసపాటిరేగ: స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

ఇద్దరు సిబ్బందిని కేటాయించాలని, వారికి కేటాయించిన సమయంలో వారే విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులను వెంటనే పరిస్థితిని చక్కదిద్ది నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఎల్.కోట మండల తహశీల్దార్ కార్యాలయం కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి తగు సూచనలు జారీ చేసారు. ఎస్ కోట, జామి మండల తహశీల్దార్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూములను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణే ప్రాధాన్యంగా భావించాలని స్పష్టం చేశారు. అత్యధిక వర్షపాతం, గాలులు వీచే పరిస్థితుల నేపథ్యంలో దుర్భర గ్రామాలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సిబ్బంది హాజరు, సమాచార సేకరణ, సమన్వయం వంటి అంశాలపై సూచనలు జారీ చేశారు. ప్రతి కంట్రోల్ రూమ్ 24 గంటలు యాక్టివ్‌గా ఉండాలని, నిర్లక్ష్యం సహించబోనని హెచ్చరించారు.

డెంకాడ: మండలంలోని చొల్లంగిపేలో వరి పంటను జిల్లా ఇంచార్జి వ్యవసాయాధికారి కె.భారతి సోమవారం పరిశీలించారు. తుపాను నేపథ్యంలో పంట పొలాల్లో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం, వరి పంటలో ముంపు, గాలి నష్టాన్ని తగ్గించేందుకు రైతులకు మార్గదర్శ కాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవ సాయ సంచాలకులు ఏ. నాగభూషణ రావు, సహాయ సంచాలకుడు విజయ్ కుమార్ రైతులు పాల్గొన్నారు.


నీటమునిగిన పంటను బయటకు తీస్తున్న రైతు

రేగిడి: నదీ పరివాహక ప్రాంతాలలో అధికారులు పర్యవేక్షణ జరిపి ప్రజలను అప్రమత్తం చేయాలని తహశీల్దార్ ఐ. కృష్ణలత, ఎంపిడిఒ శ్యామల కుమారి సూచించారు. సోమవారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. తుపాను నేపథ్యంలో భారీ నుంచి అతి భారీ వర్షాలకు నాగావళి, మడ్డువలస, ఆకులలోవ కట్టగెడ్డ ఉధృతికి ప్రజలను అప్రమత్తం చేసే విధంగా అధికారులు పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో వరద చేరితే ఆ కుటుంబాలకు రేషన్ పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. సంకిలి హైస్కూల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవుదల కెజిబివిని వారు పరిశీలించారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మికి సూచించారు.

కొత్తవలస: తుపాను పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ పి.అప్పలరాజు చెప్పారు. తాగనీరు, రోడ్లు, వాగులు, వంకలు అడ్డంకులు లేకుండా జెసిబితో తొలగించామన్నారు. ఎంపిడిఒ ఎస్.రమణయ్య, రాష్ట్ర రోడ్డు రవాణా అధికారి జూనియర్ అసిస్టెంట్, విద్యుత్ ఎఒ సూరిబాబు, డిటి ఆర్ఐ ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో అన్ని గ్రామాలకు వాగులు వంకలు పొంగి ప్రవహిస్తాయని ముందస్తు జాగ్రత్తగా గస్తీ నిర్వహిస్తున్నామన కొత్తవలస సిఐ షణ్ముఖరావు తెలిపారు. మండలంలో కొన్ని ప్రమాదకర రహదారులను గుర్తించామని ఆ రహదారుల వల్ల ప్రజలకి ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా ముందస్తుగా ఆ రహదారులలో సిబ్బందిని నియమించామని అన్నారు.

తుపాను పట్ల అప్రమత్తంగా ఉండండి: ఎమ్మెల్యే

శృంగవరపు కోట: తుపాను పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం ఆమె మండలంలోని మూలబొడ్డవర గ్రామంలో పర్యటించారు. తుపాను వల్ల వచ్చే కొండగెడ్డల నుండి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆమె వెంట తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ సతీష్, శ్రీనురాజు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో అలసత్వం చూపితే కఠిన చర్యలు

రామభద్రపురం: తుపాను సహాయక చర్యల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అలసత్వం చూపితో కఠిన చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి జి.ప్రశాంతకుమార్ హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం తుపానుపై మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో పూరిళ్లలో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా దండోరా వేయించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రత్నం, తహశీల్దార్ అజురపిజాన్, ఎస్ఐ ప్రసాదరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


తెర్లాం: నేలకొరిగిన వరి పంట

చెరువులు, కాజ్‌వేలు పరిశీలన

తెర్లాం: మండలంలో కాలంరాజుపేట, నందిగామ, వి.చిన్నయ్యపేట, తెర్లాం, వెలగవలస గ్రామాల్లో ఉన్న చెరువులు, కాలువ గట్లును జి.హేమంత్ కుమార్ పరిశీలించారు. ప్రజలను, రైతులను అప్రమత్తం చేశారు. గొర్రెల కాపర్లు అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. వర్షానికి పలు గ్రామాల్లో వరి నేలకొరిగింది.

రోడ్డు పక్కన చెట్లు తొలగింపు

మండలంలోని పెరుమాలి, జగన్నాధవలస మీదుగా రాజాం రామభద్రపురం వైపు వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న భారీ వృక్షాన్ని రెవెన్యూ అధికారులు తొలగించారు. తుపాను నేపథ్యంలో గాలులు వీస్తే ఈ వృక్షం కూలిపోయే ప్రమాదం ఉందని ముందస్తు చర్యల్లో భాగంగా తొలగించినట్లు అధికారులు చెప్పారు.

నష్ట నివారణకు చర్యలు చేపట్టాలి

బొబ్బిలి: మొంథా తుపాను నష్టం నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆర్‌డిఒ రామ్మోహనరావు ఆదేశించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో మున్సిపల్, మండల పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుతో అత్యవసర సమావేశం నిర్వహించారు. తుపాను బాధితుల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి వసతులు కల్పించాలన్నారు. ఎంపిడిఒ రవికుమార్, కమిషనర్ రామలక్ష్మి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

చిరు జల్లులతో వర్షం.. రైతన్నల్లో ఆందోళన

బొబ్బిలి: మొంథా తుపాను ప్రభావంతో సోమవారం బొబ్బిలి పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరిపంట కోత దశకు వచ్చిన సమయంలో వర్షాలు కురవడంతో పంటకు నష్టం జరుగుతుందోనని రైతులు భయపడుతున్నారు. చిన్న వర్షాలకు వరిపంట నేల కోరిగిందని, భారీ వర్షాలు కురిస్తే అధిక నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్

మున్సిపాలిటీలోని లోతట్టు ప్రాంతాలను సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి సందర్శించారు. లోతట్టు ప్రాంతాలలో వరదనీరు నిల్వ లేకుండా చూడాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. అప్పయ్యపేట కాలువలో నీరు సక్రమంగా వెళ్లేలా జెసిబితో పూడికలు తీశారు. బాధితుల కోసం అయ్యప్ప ఐటిఐ, పాత బొబ్బిలిలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, నిర్వాసితులను తరలించాలని ఆదేశించారు. పురిల్లు, పాత ఇళ్లలో నివసిస్తున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని కోరారు. ఏదైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 9989817042కుఫోన్ చేయాలన్నారు.

రాజాం: మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్‌రావు, ఎఇ వెంకట్ రామరాజు పట్టణంలో పలు ప్రాంతాలను పరిశీలించారు. మెంతిపేట చెరువు నుంచి వచ్చే నీరు మెయిన్ రోడ్డు మీదకు రాకుండా చూసుకోవాలని, ఒకవేళ వచ్చిన కాలువలోకి మళ్లింపు అయ్యేలా చర్యలు వెంటనే చేపట్టాలని సచివాలయ సిబ్బందికి తెలిపారు. తుపాను సహాయక చర్యలు నిమిత్తం 11 సచివాలయాలకు 11 మంది నోడల్ అధికారులను నియమించామని, 15 మంది స్పెషల్ వర్కర్లను నియమించామని, నాలుగు ట్రాక్టర్లు రెండు జెసిబిలను సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉంచామని అన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి

దత్తిరాజేరు: దూసుకొస్తున్న తుపాను ప్రభావంతో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అధికారులకు, సిబ్బంది మూడు రోజులు సెలవు ఇవ్వొదన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయం కలిగే విషయాలను దండోరా వేసి చెప్పాలన్నారు. వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులను ఇంటికి పంపించొద్దని, వారికి తప్పనిసరిగా వేడి నీళ్ల మాత్రమే ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

చెల్లాపురం క్వారీ పరిశీలన

మెరకముడిదాం: మండలంలో చెల్లాపురంలో అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న క్వారీ ప్రాంతాన్ని ఎంపిడిఒ జి.భాస్కరరావు సోమవారం పరిశీలించారు. అనంతరం గర్భాం, బైరిపురం, మెరకముడిదాం పునరావాసి కేంద్రాలను సందర్శించారు.

అల్లకల్లోలంగా సముద్రం

పూసపాటిరేగ: మొంథా తుపాను ప్రభావంతో తీర ప్రాంతాల్లో ఈదురు గాలులు, వర్షాలు ప్రారంభమయ్యాయి. వాయుగుండం తీవ్ర తుపాన్‌గా మారడంతో సముద్రం అల్లకల్లోలంగా మారి ఎగసిపడుతోంది. దీంతో చింతపల్లి తీరం వద్ద సముద్రం ఒడ్డు భారీగా కోతకు గురైంది. ఈ పరిణామంపై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలోని తీర మండలాలైన పూసపాటిరేగ, భోగాపురం మండలాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భోగాపురం మండలంలోని ముక్కాం తీర గ్రామాన్ని సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ రామనారాయణరెడ్డి, ఎస్‌పి దామోదర్ కలిసి పరిశీలించారు. పూసపాటిరేగ మండలంలోని కోనాడ, తిప్పలవలస ప్రాంతాల్లో మండల స్థాయి అధికారులు పర్యటిస్తూ పరిస్థితిని పరిశీలించారు. తీర ఈ రెండు మండల కేంద్రాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. తీర గ్రామాల్లో అధికారులను నియమించి, అక్కడి పరిస్థితుల వివరాలను ప్రత్యేక అధికారులకు నిరంతరం తెలియజేస్తున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం మంగళవారం, బుధవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. తుపాను తీరం దాటే సమయంలో పెనుగాలులు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

మైరెన్ పోలీసుల గస్తీ

తీరప్రాంతాల్లో సముద్రం మరింత అల్లకల్లోలంగా మారి కెరటాలు ఎగిసిపడుతుండటంతో మెరైన్ పోలీసులు గస్తీ కాస్తున్నారు. మత్స్యకారులు సముద్రం వద్దకు వెళ్లకూడదని, అధికారులు అనుమతి ఇచ్చే వరకు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. కార్తీకమాసం కావడంతో సోమవారం భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో చింతపల్లి తీరం చేరుకున్నారు. వెంటనే మెరైన్ పోలీసులు స్పందించి వారిని అడ్డుకున్నారు. తుపాను ప్రభావం పూర్తయ్యే వరకు ఐదు రోజులపాటు పర్యాటకులను సముద్రతీరాలకు అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికే వచ్చిన వారు వెంటనే వెనుదిరగాలని సూచించారు. మెరైన్ ఎస్ఐ వాళ్లె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తీరప్రాంతమంతా పోలీసులు గస్తీ కాస్తూ, ప్రజల భద్రత కోసం చర్యలు చేపట్టారు.

పునరావాస కేంద్రాలు సిద్ధం

తుపాన్ నేపథ్యంలో తీరంలోని గుడిసెలు, రేకుల షెడ్లల్లో నివసించే వారిని అధికారులు గుర్తించారు. కోనాడ పరిసరాల్లోని లోతట్టు ప్రాంత ప్రజల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. అవసరమైతే వారిని వెంటనే ఈ కేంద్రాలకు తరలించేందుకు సిద్ధం చేశారు. పునరావాస కేంద్రాల్లో నిత్యావసర సరుకులు, తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

తీర గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే నాగ మాధవి

మండలంలోని తిప్పలవలస, కోనాడ, బర్రిపేట గ్రామాల్లో ఎమ్మెల్యే లోకం నాగమాధవి పర్యటించారు. కోనాడలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. భారీ వర్షాలు నమోదైతే భారీ వర్షాల వల్ల వరదలు వస్తే వెంటనే అప్రమత్తం అవ్వాలని అధికారులకు సూచించారు. ముందుగానే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని అధికారులు చెప్పారు. తాగునీరు, విద్యుత్తు, పారిశుధ్యం వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ రాధికకు తెలిపారు. మత్స్యకారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. జనసేన నాయకులు పతివాడ శ్రీను, వందనాల అప్పలరాజు, బొడ్డు ఎల్లాజీ, ఈజ్జుపు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


నెల్లిమర్ల: ప్రజలను అప్రమత్తం చేస్తున్న కమిషనర్


బొబ్బిలి: సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ రామలక్ష్మి


ఎస్‌కోట: మాలబొడ్డవర గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- రాజాం

డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకు విశాఖలో జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్ కోరారు. రాజాం రైస్ మిల్లు కార్మికులతో కలిసి సోమవారం మహసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి సారిగా జరుగుతున్న ఈ మహాసభలకు కోటిమంది కార్మికులకు, ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహించే దేశం నలుమూలల నుండి 2వేల మంది కార్మిక నాయకులు ప్రతినిధులుగా హాజరు కాబోతున్నారని చెప్పారు. జనవరి 4న లక్షలాది కార్మికులు, ఉద్యోగులతో మహాప్రదర్శన, బహిరంగసభ ఉంటుందన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయావలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైస్‌మిల్ నాయకులు అప్పలనాయుడు, వెంకటరమణ, గౌర్నాయుడు, అప్పయ్య, లక్ష్మునాయుడు, వి.వెంకటరమణ, చిన్న బాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు తహశీల్దార్‌గా హరికిరణ్



ప్రజాశక్తి- దత్తిరాజేరు

మండల నూతన తహశీల్దార్‌గా కె.హరికిరణ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన విజయభాస్కర్ సెలవు పై వెళ్లడంతో గంట్యాడ మండలంలో హెచ్‌డిటిగా పనిచేసిన హరికిరణ్ దత్తరాజేరు మండలానికి బదిలీపై వచ్చారు. ఆయనకు తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది బొకేతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో రైతుల రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న రామభద్రపురం సచివాలయం-3 ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్. నవీన్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక టిడిపి నాయకులు, ఎంపిటిసి భవిరెడ్డి చంద్ర, జనసేన నాయకుడు మహంతి ధనంజయ, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు చొక్కాపు రామారావు సోమవారం ఎంపిడిఒ రత్నంకు ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండని ఇతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ప్రధానమంత్రి గృహ యోజన పథకం పేర్లు నమోదు కోసం జియో ట్యాగింగ్ విషయమై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొర్లె రామారావు, చింతల ఆదినారాయణ, మజ్జి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో ఓపెన్ హౌస్

ప్రజాశక్తి- డెంకాడ

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా చింతవలస 5వ బెటాలియన్ కమాండెంట్ సిహెచ్‌విఎస్ పద్మనాభ రాజు ఆధ్వర్యంలో ఎస్‌విఎస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో సోమవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయుదాలు, కమ్యూనికేషన్ వ్యవస్థ గురించి, డిజాస్టర్ మేనేజ్ మెంట్ సామగ్రి ప్రదర్శన చేసి సిబ్బంది పనితీరు పట్ల పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్శిటీ విద్యార్థులు, ఎస్‌విఎస్ పాఠశాల విద్యార్థులు, అదనపు కమాండెంట్ సి.రాజారెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.బాపూజీ, ఆర్‌ఐలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం దిశగా అడుగులు

భోగాపురం: రైతుల సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం అడుగు వేస్తుందని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. భోగాపురంలో ఆధునిక రైతు బజార్‌కు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు ఈ బజార్ ఎంతో ఉపయోగపడు తుందన్నారు. దళారుల దోపిడీ తగ్గి, రైతులకు గరిష్ట గిట్టుబాటు ధర, వినియోగదారులకు తక్కువ ధరతో సరకులు అందించడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ బాసి దుర్గ, జనసేన పార్టీ సీనియర్ నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు, పడాల శ్రీనివాసరావు, పల్లంట్ల జగదీష్, పల్ల రాంబాబు, బొల్లు త్రినాథ్, మాత నవీన్, కర్రోతు శ్రీనివాసరావు, గుండపు సూరిబాబు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ ఆర్థిక సాయం

వేపాడ: మండలంలోని భరతవాణిపాలెం గ్రామానికి చెందిన దేవుపల్లి సత్యనారాయణ సహజ మరణం చెందడంతో ఆయన భార్య దేవుడమ్మకు విశాఖ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం నిధుల నుండి రూ. 30 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షు పోతుల వెంకటరమణ, ఎస్‌కోట అసిస్టెంట్ డైరెక్టర్ వెటర్నరీ డాక్టర్ వి చలపతిరావు, అసిస్టెంట్ మేనేజర్ ఎం నాయుడు బాబు, సిబ్బంది పాల్గొన్నారు.


దేవుడమ్మకు నగదు అందిస్తున్న ప్రతినిధులు

వసతిగృహాన్ని పరిశీలించిన డిడి

ప్రజాశక్తి- గంట్యాడ

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ ఎస్‌సి వసతి గృహాన్ని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.వెంకటేశ్వరరావు సోమవారం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో మెలిగి పెద్ద చదువులను చదువుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. వసతి గృహంలోని మౌలిక సదుపాయాలు భోజనం ఏ విధంగా ఉందని ఆరా తీశారు. పిల్లలు ఆరోగ్యం పట్ల విద్య మీద శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి గొర్లె గోవింద సన్యాసిరావు పాల్గొన్నారు.

'నిజం తెలుసుకొని మాట్లాడాలి'

ప్రజాశక్తి - చీపురుపల్లి

అన్నదమ్ములు కిమిడి నాగార్జున, కిమిడి రామ్ మల్లిక్ నాయుడు ఇద్దరూ నిజం తెలుసుకొని మాట్లాడాలని వైసిపి జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలి రెడ్డి శ్రీనివాసనాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు మీసాల వరహాలునాయుడు, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణలు విరుచుకుపడ్డారు. వైసిపి పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ విదేశాలలో చదువుకున్నాను అని చెప్పి కల్లబొల్లి కబుర్లు చెబుతున్న నాగార్జునకు గూగుల్ అంటే ఏమిటో తెలియదన్నారు. అసలు గూగుల్ డేటా సెంటర్‌ని అభివృద్ధి చెందిన దేశాలలో తిరస్కరించారని, భారతదేశంలో కూడా చాలా రాష్ట్రాలలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయవద్దని చెప్పడంతో ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిందన్నారు. బెల్ట్ షాప్‌లు లేకుంటే కర్నూలులో బస్సు ప్రమాదం జరిగేది కాదన్నారు. ఇత దేశాలల్లో కార్పొరేట్ కాలేజీల్లో చదువుకున్న వారిద్దరి అన్నదమ్ములకి పేదవాడి కష్టమేమిటో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఈ సమావేశంలో ఏఎంసి మాజీ చైర్మన్ దన్నాన జనార్ధన్‌తో పాటు స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మండల నూతన కమిటీని సోమవారం నియమించారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా రఘుమండ త్రినాధరావు, గిరిడి రామదాసు, ప్రధాన కార్యదర్శిగా మీసాల రఘు, పిసిని శ్రీను, గొర్ల వెంకటరమణ, పనస అప్పారావు, కార్యదర్శులుగా చింతాడ లక్షణ, పాండ్రంకి సత్యం, బైరెడ్డి లక్ష్మణ, గవిడి సురేష్, ఆకుల అప్పారావు, ఎగ్జిక్యూటివ్ నెంబర్లుగా కొసిరెడ్డి రమణతో పాటు మరో 17 మందిని నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల వైసిపి నాయకులు పాల్గొన్నారు.